క్లుప్తంగా

వైభవంగా బోనాల ఉత్సవం



కొండపాకలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలోని వేదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో మైసమ్మ తల్లి బోనాల ఉత్సవం నిర్వహించారు. విద్యార్థులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మైసమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ధన్‌గర్ మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల విశిష్టత తెలిసేలా ఆషాఢ మాస బోనాల ఉత్సవం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుదాం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తాచాటేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వర్గల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. రుణమాఫీ అమలు తీరు, అర్హులకు అందని వైనాన్ని జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ హామీల అమలు తీరు సమీక్షించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల రాములు, జిల్లా నాయకుడు నందన్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల ఆమోదంపై హర్షం



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులకు రూ.470 కోట్ల విడుదలకు క్యాబినెట్ ఆమోదం తెలపడంతో గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, స్వర్ణలత, నాయకులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతుల చిరకాల స్వప్నం గౌరవెల్లి రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి అక్కన్నపేటలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, పట్టణ అధ్యక్షుడు చింతాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

బలహీన వర్గాలపై దాడులు ఆందోళనకరం

బెజ్జంకి(సిదిదపేట): దేశంలో రోజురోజుకు బడుగు, బలహీన వర్గాల ప్రజలపై దాడులు పెరుగుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం బెజ్జంకిలో ఢిల్లీలో ఈనెల 7 నుంచి నిర్వహించే హలో మాల.. చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, శ్రీనివాస్, పర్శరాములు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాసుల అందజేత

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు, చిన్నకోదూరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య ఆర్థిక సహాయంతో గురువారం మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బస్‌పాసులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థులకు వసతులు సమకూరడం సంతోషంగా ఉందన్నారు.



బసు పాసులు అందజేస్తున్న నాయకులు

రాస్తారోకోలు.. దిష్టిబొమ్మ దహనాలు

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పార్టీ శ్రేణులు గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. రాస్తారోకోలు చేసి సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే మహిళా ఎమ్మెల్యేలకు బేషతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించడంతో వాహనదారులు నానా అవస్థలుపడ్డారు.



హుస్నాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దుబ్బాకలో ..



చేర్యాలలో..



వర్గల్‌లో

తల్లి పాల వారోత్సవాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. సూపర్ వైజర్ నాగమణి ముర్రుపాలు ఏ విధంగా ఇవ్వాలో వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అమృత, అంగన్‌వాడీ టీచర్లు వీరమణి, స్వరూప, రేణుక, శోభ, కృష్ణవేణి, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న స్వరూపరాణి

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): నవజాత శిశువులకు తల్లి ఇచ్చే ముర్రుపాలు కీలకమని చేర్యాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మద్దూరు 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు వ్యాధి నిరోధక శక్తిగా పని చేస్తాయన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు యాకవ్వ, దుర్గ, లత, మౌనిక, ఆశా వర్కర్ శోభ, చిన్నారుల తల్లులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్

దుబ్బాక: మున్సిపాల్టీ సమస్యల పరిష్కారానికి వార్డు ఆఫీసర్లు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ ఆదేశించారు. గురువారం దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రమేశ్ కుమార్

మహిళా సంఘాలకు రుణాలివ్వండి

సిద్దిపేట లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేసిన రూ.2 లక్షల రుణమాఫీ సమస్యలను అధిగమించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు అన్నారు. గురువారం ఐఓసీ భవనంలో బ్యాంకర్స్, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1.50 లక్షల లోపు రుణాలను మాఫీ చేసిందన్నారు. అర్హతగల రైతులకు రుణమాఫీ కాకపోతే అధికారులు క్షేత్ర పరిశీలన చేసి రుణమాఫీ చేయించాలని సూచించారు. పంటల సాగుకు రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వశక్తి మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం బ్యాంకులు లీంకేజీతో పాటు స్వయం ఉపాధి పొందే మహిళలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. పాడి పరిశ్రమ, ఫౌల్ట్రీ ఫాం, క్యాంటీన్లు, మీసేవా కేంద్రాల నిర్వహణ యూనిట్లకు రుణం మంజూరు చేసి యూనిట్ల ఏర్పాటు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఏఓ మహేశ్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్లు అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ హరిబాబు

స్వయం ఉపాధి పొందాలి

గ్రామీణ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు అన్నారు. గురువారం హుస్నాబాద్ మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ నెల రోజులు నిర్వహించిన ఉన్నతి ముంగిపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అల్లికలు, కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ తర్వాత అల్లిక కిట్స్‌ను పంపిణీ చేశామన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు ఇస్తాయని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఏపీఓ పద్మ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం

సిద్దిపేటకమాన్: భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కర్రోళ్ల రవిబాబు అన్నారు. సిద్దిపేటలో ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు విద్య, ఉద్యోగాల్లో నష్టపోయారన్నారు.



సిద్దిపేటలో స్వీటు తినిపిస్తున్న న్యాయవాది

వర్గీకరణను స్వాగతిస్తున్నాం

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లె మోహన్ గురువారం అన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో తీర్పు వెల్లడించారని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని బీఆర్ఎస్వీ మండల కోఆర్డినేటర్ తప్పెట పర్శరాములు అన్నారు. గురువారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఫలించిందన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగలు, ఉపకులాలు తరలివచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు మంద కృష్ణ చేసిన పోరాటాల ఫలితమే వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆదేశించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం బెజ్జంకిలో ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో..

గజ్వేల్‌రూరల్: సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీర్పు రావడంతో గురువారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తదితర సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశాయి. ప్రజ్ఞాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద, గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్, మైస రాములు, జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ పాల్గొన్నారు.

ఎండకు ఎండి.. వానకు తడిచి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో వదిలేసిన గోనె సంచులే ఎండకు ఎండుతున్నాయి, వానకు తడిచిపోతున్నాయి. ఐటీవల సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించారు. కొనుగోలు కేంద్రం ముగిసిన తర్వాత వాటిని గోదాముకు తరలించి భద్రపరచాలి. కానీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి వర్షాలకు తడిచిపోయాయి. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన గోనె సంచులను భద్రపరచాల్సిన అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా సంచులను పడేసిన అధికారులపై చర్యలు తీసుకొని, వాటిని భద్రపరచాలని కోరుతున్నారు.



అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో వదిలేసిన గోనె సంచులు

స్టాపర్ల ఏర్పాటుకు వినతి

గజ్వేల్‌రూరల్: పాఠశాలకు వచ్చే సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నామని, చౌరస్తా వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కొడకండ్ల విద్యార్థులు గురువారం పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ మండల పరిధి కొడకండ్ల ప్రభుత్వ పాఠశాలకు వచ్చేందుకు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కొండపోచమ్మకు వెళ్లేమార్గంలో గ్రామంలోని క్రాస్‌రోడ్ వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదని, దీంతో ప్రమాదాలబారిన పడే అవకాశముందన్నారు. ఇక్కడ స్టాపర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కుకునూర్‌పల్లి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటం ఏర్పాటు చేయాలి

సిద్దిపేటరూరల్: ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో ఏర్పాటుచేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కాంగ్రెస్ నేత గడ్డం శ్రీనివాస్ రెడ్డి గురువారం కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల్లో సీఎం ఫొటో ఏర్పాటుచేయాలని, ఇప్పటి వరకు సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేయలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఫొటోను తొలగించలేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీఎం ఫొటో ఏర్పాటు చేసేలా అధికారులను కలెక్టర్ ఆదేశించాలన్నారు.



వినతి పత్రం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

టైలర్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కోహెడరూరల్(హుస్నాబాద్): టైలర్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా గుగ్గిళ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని తంగళ్లపల్లి వేణుగోపాల స్వామి దేవస్థానం (కిష్టస్వామి)గుట్ట ఆవరణంలో జరిగిన టైలర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగ్గిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మోగిలిపాలెం కృష్ణంరాజు, ప్రధానగా కార్యదర్శి, కోశాధికారిగా తుమ్మరాజు, కార్యదర్శిగా మెరుగు కనకరాజు ఎన్నికయ్యారు.

భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటండి

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: భవిష్యత్తు తరాల కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ముందు నాటిన మొక్కలకు నీళ్లు పోసి కాపాడుకోవాలన్నారు. చెట్లను కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఇబ్బంది ఉండదన్నారు. ఆక్సిజన్ కొనుక్కునే పరిస్థితి రావద్దంటే మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఆయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ వేణుయాదవ్, కోఆప్షన్ సభ్యురాలు లలిత, సిబ్బంది పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో మొక్కలు నాటుతున్న రజిత

పర్యావరణాన్ని కాపాడదాం

గజ్వేల్‌రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదామని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా గురువారం పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటితే మానవాళికి ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. మొక్కలు నాటడమేకాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శంకర్, యాదగిరిరెడ్డి, ఏఎస్ఐ పాండరి, కానిస్టేబుళ్లు స్వామిగౌడ్, అమర్, భవానీ, స్వాతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో మొక్కలు నాటాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి పిలుపు ఇచ్చారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగం, నరేందర్, మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేటకమాన్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు 30 శాతం జీతాలు పెంచడాన్ని హర్షిస్తూ సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు కృష్ణారావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు కళాకారులు గురువారం క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కళాకారులు భాస్కర్, నర్సింలు, ఎల్లం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



మోహన్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆశాజ్యోతిలో ఆశ్రయం పొందుతున్న యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన గురువారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లో జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలోని సీడబ్ల్యూసీ ద్వారా కుక్కల మోహన్(17) 2021లో ప్రజ్ఞాపూర్‌లోని ఆశాజ్యోతిలో చేరాడు. అయితే ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. మోహన్ వెళ్లే సమయంలో పసుపు రంగు షర్టు, బ్లూ కలర్ ప్యాంటు, కళ్లజోడు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దుబ్బాక టౌన్: దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కొండయ్య స్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి చొరవతో ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నుంచి కొంత మొత్తం చెక్కు రూపంలో విడుదల చేసింది. గురువారం లబ్ధిదారుడికి విడుదలైన రూ.43,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు యాదవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింలు, లచ్చయ్య పాల్గొన్నారు.

◆ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గం, క్యాసారం, తూప్రాన్ రోడ్డు చౌరస్తా, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేపట్టామన్నారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 30 మందిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచగా రూ.19,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ నిత్యాన్నదానానికి విరాళం అందజేత

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సిద్దిపేటకు చెందిన భక్తులు మాంకాల గాలయ్య, ఉమారాణి దంపతులు రూ.50,116 విరాళంగా గురువారం ఆలయ అధికారులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

◆ తాగునీటి కోసం ఆందోళన

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని కిష్టంపేట గ్రామంలో తాగునీటి కోసం మహిళలు గురువారం ఖాళీ బిందెలతో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా గ్రామంలో తాగు నీరు సరఫరా కావడంలేదని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదన్నారు. తాగు నీటిని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మురళిని వివరణ కోరగా శుక్రవారం నుంచి నీటి సరఫరా చేస్తామన్నారు.

◆ సీఐకి సన్మానం

ములుగు(గజ్వేల్): గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డిని గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి వర్గల్ మండలం రూరల్ సర్కిల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. సీఐని కలిసినవారిలో బీజేపీ నాయకులు సత్యం, మహేష్ పాల్గొన్నారు.

◆ పండితులు ఉత్సాహంతో పనిచేయాలి

చేర్యాల(సిద్దిపేట): పదోన్నతి పొందిన పండితులు ఉత్సాహంతో పనిచేయాలని కడవేర్గు కాంప్లెక్స్ హెచ్ఎం బల్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పదోన్నతి పొందిన పండితులు భాషల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఉన్నతంగా నిలబెట్టేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రచ్చ కిష్టయ్య, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతి కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ బోరుమోటారు ఏర్పాటు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రోల్ల దాసు గురువారం తన సొంత డబ్బుతో బోరు తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవే తమ లక్ష్యమన్నారు.

◆ విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దని, శ్రద్ధగా చదువుకోవాలని ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

◆ సహ చట్టం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా అశోక్ యాదవ్

నంగునూరు(సిద్దిపేట): సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నంగునూరు మండల అధ్యక్షుడిగా పాలమాకులకు చెందిన గుండెల్లి అశోక్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులకు అశోక్ ధన్యవాదాలు తెలిపారు.

◆ దుబ్బాక ముదిరాజు సంఘం అధ్యక్షుడిగా రాజు

దుబ్బాక: దుబ్బాక పట్టణ ముదిరాజు సంఘం ఎన్నికలు గురువారం రసవత్తరంగా జరిగాయి. మాడవైన రాజు రెండోసారి అధ్యక్షుడిగా గెలుపొందారు. 302 ఓట్లకు 295 పోలయ్యాయి. 207 ఓట్లు రాజుకు, 86 ఓట్లు దేవుని ఉపేందర్‌కు రాగా, 2 ఓట్లు చెల్లలేదు. 121 ఓట్ల మెజార్టీతో రెండోసారి అధ్యక్షుడిగా రాజు గెలుపొందాడు. ఎన్నికల ఇన్‌చార్జిగా కేసుగారి రాములు, దేవుని శ్రీనివాస్, దేవుని భాస్కర్ వ్యవహరించారు. దేవుని రాజు, తోట్ల మల్లయ్య, చింతకింది నర్సింలు, పర్స రవీందర్, గాండ్ల బాల్‌నర్సయ్య, జంగిటి మల్లయ్య, మాడవైన యాదగిరి, దేవుని లక్ష్మయ్య పాల్గొన్నారు.

◆ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ పద్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని విఠలాపూర్‌లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాట్లు వేసి 20 రోజుల వ్యవధి ఉన్నందున గడ్డి జాతి, వెడల్పు ఆకు కలుపు నివారణకు బీస్ పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలన్నారు. పత్తిలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఉందని ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లేదా డైఫెన్ థయోరాన్ 1.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

◆ ఆడబిడ్డలను గౌరవించే పార్టీ కాంగ్రెస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆడబిడ్డలను గౌరవించే పార్టీ కాంగ్రెస్ అని, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. మహిళా ఎమ్మెల్యేలకు గత ప్రభుత్వంలో అనేక అవమానాలు ఎదురయ్యాయన్నారు. సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్‌లో మహిళా కౌన్సిలర్లకు బదులు పురుషులే అధికారాన్ని చెలాయిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కార్యదర్శి గ్యాదరి మధు, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: ఆగస్టు 17, 18, 19 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు సిద్దిపేట బీజేఆర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీకాంత్, విజయ్‌కుమార్, గణేష్, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.